# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-04-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **జీఎస్డీపీ లక్ష్యాలను సాధించేలా సూక్ష్మ స్థాయి ప్రణాళికలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **చట్టసభల్లో మహిళల ప్రాతినిథ్యం పెంచేందుకు నారీ శక్తి వందన అధినియం దోహదపడుతుందని ఆంధ్రప్రదేశ్ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు**

3. **విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ అనుకూలమని పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు.**

4. **ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో అగ్నిమాపక శాఖ కీలక పాత్ర పోషిస్తుందని ఆంధ్రప్రదేశ్ మంత్రి వాసం శెట్టి సుభాష్ తెలిపారు**

==========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థూల ఉత్పత్తి – జీఎస్డీపీ లక్ష్యాలను సాధించేందుకు వీలుగా సూక్ష్మ స్థాయి ప్రణాళికలు అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక శాఖపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా 15 శాతం మేర వృద్ధి రేటు లక్ష్యాన్ని చేరుకునేలా క్షేత్రస్థాయిలో చర్యలు సమర్థంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. పూర్వోదయ, సాస్కి వంటి వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతం చేయాలని సూచించారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి అయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను దృశ్యమాధ్యమం విధానంలో ఈ రోజు ప్రారంభిస్తారు. భీమవరం నియోజకవర్గంలో 7 కోట్ల రూపాయలతో చేస్తారు. గొల్లవాని తిప్ప వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం 20 కోట్ల రూపాయలతో చేపట్టిన భీమవరం అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని స్థానిక శాసన సభ్యులు పి.రామాంజనేయులు తెలిపారు.

-------------------------

చట్టసభల్లో మహిళల ప్రాతినిథ్యం పెంచేందుకు నారీ శక్తి వందన అధినియం దోహదపడుతుందని

ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఢిల్లీలో జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చను రాష్ట్ర మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి నిన్న తిలకించారు. అనంతరం మంత్రి సవిత పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 19 సెకన్లు

---------------------------

విమానయాన, అంతరిక్ష, రక్షణ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ అనుకూలమని పరిశ్రమలశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో 'యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' బృంద సభ్యులు మంత్రితో నిన్న ప్రత్యేకంగా సమావేశమైయ్యారు. ఆయా రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణలో ఉన్న అవకాశాలు, సులభతర వాణిజ్య విధాలను శ్రీధర్‌బాబు వారికి వివరించారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు.. యుద్ధ విమానాల విడిభాగాల నుంచి ఉపగ్రహాల వరకు.. ఈ రంగాల్లో తెలంగాణ 30 శాతానికి పైగా వృద్ధి రేటును నమోదు చేస్తోందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి బృహత్ ప్రణాళికలను రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో దేవాదాయ శాఖపై ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. శ్రీవాణి నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న 5 వేల దేవాలయాలను వచ్చే 2 ఏళ్లల్లో పూర్తి చేయాలన్నారు. ఈ ఆలయాల నిర్మాణ పర్యవేక్షణ కోసం రాష్ట్ర స్థాయి కమిటీ వేయాలని సూచించారు. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సాహించేలా దేవాలయాల వద్ద వసతి సౌకర్యాలు మెరుగుపరచాలని... ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని జువ్వలదిన్నె హార్బర్ ను ప్రైవేటీకరణ చేయబోమని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రులు నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, మచిలీపట్నం, జువ్వలదిన్నె వంటి ప్రాంతాల్లో అత్యాధునిక సదుపాయాలతో .. దాదాపు ఒక్కో ఫిషింగ్ హార్బర్ ను 350 నుంచి 400 కోట్ల రూపాయాలతో నిర్మిస్తున్నామన్నారు. జువ్వలదిన్నె హార్బర్ లో ఏడు ఎకరాలు మాత్రమే ఒక సంస్థకి ఇచ్చామని దీనిపై జరుగుతోన్న ప్రచారంలో వాస్తవం లేదని కొల్లు రవీంద్ర తెలియజేస్తూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

కేంద్ర ప్రభుత్వం చేపట్టి పూర్తికావచ్చిన ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, నిర్మాణం ప్రారంభించాల్సిన ప్రాజెక్టుల శంకుస్థాపన కోసం తెలంగాణలో పర్యటించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రికి నిన్న లేఖ రాశారు. తెలంగాణలో పరిశ్రమలు, రైల్వేలు, రహదారులు, ఆదివాసీ సంక్షేమం సహా వివిధ రంగాల్లో జరుగుతున్న అభివృద్ధిని లేఖలో వివరించారు.

---------------------------

ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో అగ్ని మాపక శాఖ కీలక పాత్ర

పోషిస్తుందని ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి  వాసం శెట్టి సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 75 లక్షల 75 వేల రూపాయలతో ఏర్పాటు చేసిన ఆధునిక అగ్నిమాపక వాహనాన్ని మంత్రి  నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లడుతూ …

వాయిస్ 20 సెకన్లు

---------------------------

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో రైల్వే వారోత్సవాలను నిన్న నిర్వహించారు. విజయవాడలోని రైల్వే ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనకియా ముఖ్య అతిథిగా పాల్గొని 58 మంది ఉద్యోగులకు రైల్ సేవా పురస్కారాలు, మరో 12 మందికి ప్రత్యేక గుర్తింపు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం మోహిత్ సోనకియా మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో విజయవాడ డివిజన్ 5 వేల 939 కోట్ల రూపాయల ఆదాయం నమోదు చేసిందని తెలిపారు. అదేవిధంగా 40.64 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసినట్లు వెల్లడించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్, ట్రాక్ పునరుద్ధరణ వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు.

---------------------------

చిన్నారుల ఎదుగుదల.. మెదడు వికాసంలో తల్లి తండ్రుల పాత్ర ప్రత్యేకమైనదని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నెల్లూరు విభాగ క్షేత్ర ప్రచార సహాయకులు పి. హరి కృష్ణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెద్ద చెరుకూరు గ్రామంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆయన నిన్న ప్రసంగించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో క్రమేపీ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లోని 215 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా నిన్న 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

తెలంగాణలో అత్యధికంగా జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో 44.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================